# ప్రకృతి - వికృతి

" ఓ దేవుడా! నువ్వంటూ వుంటే నన్ను రక్షించు తండ్రీ "! అని అరిచాడు సుబ్బారావు బాధగా - పెద్దగా.

" అదేంటండీ అలా అంటారు - దేవుడు లేకపోతే మనం ఎలా వుంటాం?" సులోచన సాలోచనగా అడిగింది.

" మరి మనల్ని కాపాడ్డానికి రాడేం? ఆయన అస్తిత్వాన్ని నిరూపించుకోవడానికి చక్కని అవకాశం చిక్కింది. రమ్మను - నీ దేవుణ్ణి రమ్మను. మనల్ని కాపాడమను!" కోపంగా చెప్పాడు సుబ్బారావు.

" ఆ ! ఆయన కాపాడబట్టే కదా - మనం నీళ్ళలో కొట్టుకుపోకుండా ఈ మేడమీద నిలబడగలిగాం ! ఇది కూడా మునిగిపోతే ఏం చేస్తాం?" సులోచన చెంపలు వేసుకుంటూ చెప్పింది.

" రామ! రామ! ఆయన వుంటే ఈ వరద ఎందుకు రావాలి? ఈ కర్నూలు పట్టణం యింత ఘోరంగా ఎందుకు మునిగిపోవాలి?" చిరాగ్గా అడిగాడు భార్య మీద కోపంతో.

" రామ! రామ! అది ఆయన తప్పెలా అవుతుంది? గాలిలో దీపం పెట్టి దేవుడా నీవే దిక్కు అంటే ఆయనెందుకు అడ్డుపడతాడు? మనది బుద్ధి తక్కువ! ఇంత నది ఒడ్డున ఎవరు ఇల్లు కట్టమన్నారు? ఇవి సురక్షితమైన ప్రాంతాలు కావని ప్రభుత్వం ఎప్పటి నుండో చెబుతూనే వుంది కదా! అయినా అన్నింటికీ దగ్గర అని మీరే పాతమిద్దె కొని - దాన్ని పగులగొట్టి కొత్తది కట్టించారు. కాని తుంగభద్రమ్మ తల్లి ఊరుకుంటుందా? ఉరికి ఉరికి ఊరిమీద పడింది- ఇంక మనమెంత?" సులోచన అన్ని కష్టాల్లోనూ భర్త చేసిన పొరపాట్లను గుర్తుచేయక మానలేదు.

సుబ్బారావుకు కోపం నసాళానికి అంటుతున్నది. అసలే ప్రాణభయంతో బిక్కు బిక్కుమంటూ వుంటే ఈమె నస ఒకటి మధ్యలో. కన్ను పొడుచుకునేట్లు చల్లనిగాలి! మబ్బులు తొలగినప్పుడు మినుక్కు మినుక్కు మంటున్న చుక్కలు నింగిలో! నేల అన్నది కనపడని జలప్రవాహాలు!

ప్రభుత్వం హెచ్చరించినా ఇళ్ళు ఖాళీ చెయ్యక మొండికేసిన వాళ్ళు అకస్మాత్తుగా వరద ముంచెత్తడంతో కట్టుబట్టలతో పిట్టల్లాగా పారిపోయారు. కొందరు అందిన మిద్దెలపైకి ఎగబాకారు. ఈత వచ్చినవాళ్ళు కష్టపడి ఈదుకుంటూ వెళ్ళారు. సంసారాన్ని వదిలి వెళ్ళలేని వాళ్ళు తమ ఇళ్ళపైకి ఎక్కి నిల్చున్నారు.

కరువు కాటకాలతో కొట్టుమిట్టులాడే రాయలసీమలోని కర్నూలు జిల్లాకు వరద! నిన్నటిదాకా కరువు ప్రాంతంగా ప్రకటించబడిన జిల్లా ఒక్కసారి వరద బాధిత ప్రదేశంగా వార్తల్లోకి ఎక్కింది!

పన్నెండు గంటల నుండి తిండితిప్పలు లేవు! కరెంటు లేదు - వార్తలు తెలియడం లేదు. సెల్ టవర్లు కూడా మునిగిపోవడంతో సెల్లులు కొన్ని మూగ పోతున్నాయి. మోగినవి కొన్ని బ్యాటరీచార్జి అయిపోయి మౌనవ్రతం పాటిస్తున్నాయి.

వచ్చిన చివరి యస్సెమ్మెస్సుల ప్రకారం కర్నూలు నగరం ఖాళీ చెయ్యమని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఇంకా కొందరు శ్రేయోభిలాషులు - దూర ప్రాంతాల్లో సురక్షితంగా వున్న మిత్రులు - అందినకాడికి సెల్లులు చేసి చెబుతున్నారు. మెసేజీలు పంపుతున్నారు. కాని సుబ్బారావు లాంటి కుటుంబాలకు కుటుంబాలు ఒంటరిగా నీళ్ళల్లో చిక్కుపడి సహాయం కోసం ఎదురుచూస్తున్నాయి. అలో లక్ష్మణా అంటూ.

ఎవరైనా హెలీకాప్టర్లలో వచ్చి తమను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారన్న మిణుకు మిణుకు ఆశ! మిలిటరీ కాని, పోలీసులు కాని రంగంలోకి దిగి సహాయం అందిస్తారని చిన్ని చిన్ని ఆశలు.

కాని - కాని - నిమిషాలు - గంటలు దొర్లిపోతూండటంతో - ఆ ఆశ కూడా అంతరించి పోతున్నది. కొందరికి అస్సలు ప్రభుత్వం అంటూ వుందా? అన్న అనుమానం మొలకెత్తుతున్నది.

కర్నూలులో భారీగా కురిసిన వర్షాలకు తోడు - కర్ణాటకలో అతి భారీగా కురిసిన వర్షాలు - చిన్నా పెద్దా డ్యాములను వరద ప్రవాహాలతో ముంచెత్తాయి. హొస్పేట డ్యాము పగిలిపోకుండా అత్యవసరంగా లక్షల క్యూసెక్కుల నీరు వదిలిపెడుతున్నారు. కరువుతో ఛస్తున్నాం అన్నప్పుడు ఓ పదివేల క్యూసెక్కుల నీరు కూడా యివ్వలేని కర్ణాటక ప్రభుత్వం ధారాళంగా వేలకు వేల క్యూసెక్కుల నీరు వదిలిపెడుతున్నది. సుంకేశుల డ్యాము బద్దలైందని పుకారు. అది కర్నూలుకు చాలా దగ్గరలో వుంది.

శ్రీశైలం డ్యామ్ నిండా మునిగిపోయిందని - అక్కడ నీళ్ళను కృష్ణలోకి వదులుతున్నారని వార్తలు. ఈలోగా శ్రీశైలం డ్యామ్ నీళ్ళు వెనక్కి తంతున్నాయట - కసికొద్దీ కర్నూలు జిల్లాను చుట్టుముడుతున్నాయట! బ్యాక్ వాటర్సుతో జిల్లాలోని కొన్ని

ప్రాంతాలు అతలాకుతలం!

మంత్రాలయం పూర్తిగా మునిగిపోయిందట!

అలంపురం, అమ్మవారి గుడితో సహా మునిగి పోయిందట!!

కర్నూలు సాయిబాబా గుడి పూర్తిగా మునిగిపోయి నక్షత్రం ఆకారం కనిపిస్తున్నదట! అంటే యిరవై అయిదడుగుల ఎత్తున నీరు వచ్చుండాలి! ఇవన్నీ సులోచన సెల్లుకొచ్చిన వార్తలు - విశేషాలు ! కానీ అది కూడా ఛార్జీ అయిపోవడంతో మూగ పోయింది, ఓ రెండు గంటలనుండీ.

" అల్మట్టి డ్యామ్ నుండి కూడా నీళ్ళు వస్తాయట గదా ! అప్పుడు బి.క్యాంపు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ దాకా కూడా మునిగిపోతుందట. ఇంక కర్నూలు పట్టణం అంటూ మిగలదు". సులోచన ఆలోచిస్తూ చెప్పింది తన బంధువులు తెలిపిన విషయాలను.

" ఏం మునిగినా జగన్నాథ గట్టు మునగదు కదా! కాని అక్కడికి ఎలా వెళ్ళగలం?" సుబ్బారావు అధైర్యంతో అన్నాడు.

" అన్నింటికి ఆ భగవంతుడే వున్నాడు - కాకపోతే మానవ ప్రయత్నం మనం చెయ్యాలిగా! పడవలు వస్తే బాగుండు" ఆమె చెప్పింది.

నిమిషాలు యుగాలులాగా గడిచిపోతున్నాయి. కాలం స్తంభించింది. ఏదో కోలాహలం - ఏవో కేకలు - దూరంగా వినిపిస్తున్నాయి. చిన్న ఆశాకిరణం లాగా - గుడ్డిగా ఏదో వెలుతురు కనిపిస్తున్నది.

" అదిగెలు -అదిగెలు, పడవలాంటివి వస్తున్నాయి" పక్కింటి మేడమీద నిల్చున్న అవధాని ఆనందంగా అరిచాడు - గాలివాటం వలన కొంచెం వినిపించింది.

సుబ్బారావుకు ప్రాణం లేచొచ్చింది. గట్టిగా అరిచాడు. "ఇలారండి - ఇలారండి- యిక్కడ" గట్టిగా చప్పట్లు కొట్టాడు.

భయంకరమైన నిరీక్షణ తర్వాత - బోర్లించిన గంపలు లాగా తెప్పలు దగ్గరకొస్తున్నాయి.

ఒక తెప్పను నడుపుకుంటూ ఓ వ్యక్తి వారి దగ్గర కొచ్చాడు.

మేడమీంచి కొంచెం కిందకు దిగితే - ఆతెప్ప అందుకోవచ్చు.

" రావే సులోచనా ! దేవుడు పంపించాడు-" గబగబా కిందకు అంటే రెండో అంతస్తు పైనుండి కొంచెం కిందికి దిగారు. మొదటి అంతస్తు మునిగిపోయి ఇంకా ఆరడుగులు నీళ్ళు వచ్చాయి వారింటికి.

" దుడ్లు తియ్యండి..." తెప్పనడిపే వ్యక్తి అరిచాడు, బ్యాటరీ వెల్తురులో.

" ఎంత- పదా- యాభయ్యా- వందా?" సుబ్మారావు భయపడుతూ అడిగాడు.

" ఒడ్డుకు చేరింతర్వాత ఎంతో కొంత యిద్దాం - ఇప్పుడు బేరం ఎందుకండీ- పదండి-" తొందరించింది సులోచన.

" ఆగండి - పదివేలు - ఇచ్చి ఎక్కండి" అతను కర్కశంగా అన్నాడు.

" ఆ ! పదివేలా? ఇద్దరికి పదివేలా?" బిత్తరపోయి అడిగాడు.

" ఇద్దరికి కాదు - ఒక్కరికి -" అతనింకా కర్కశంగా చెప్పాడు.

" అన్నా ! అన్నా ! మా దగ్గర అంత డబ్బు ఎందుకుంటుందన్నా ! హఠాత్తుగా వరద రావడంతో నిండా మునిగిపోయి మిద్దె ఎక్కాం - పెద్ద మనసు చేసుకుని పడవ ఎక్కించుకో అన్నా! నీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేం!" సులోచన ఏడుస్తూ బ్రతిమాలింది.

" పోమ్మా ! భలే బేరం - అక్కడ చాలామంది ఎదురు చూస్తున్నారు. దుడ్డు తియ్యందే ఎక్కడానికి లేదు" తెప్ప నడిపే అతను చెప్పాడు.

" దారుణం ! మానవత్వం మరచిపోతున్నావు- ఆపదలో వున్న వాళ్ళను ఆదుకోవాలి. నీ యిష్టం వచ్చినట్లు అవకాశం దొరికింది కదాని దోచుకోకూడదు - దేవుడు క్షమించడు" సుబ్బారావు కోపంగా ఏవేవో అన్నాడు.

" అది కాదు సామి ! మాకు తిండి దొరకనప్పుడు మీలో ఎవరన్నా వచ్చి మమ్మల్ని ఆదుకున్నారా? మాకు కష్టాలొచ్చినప్పుడుమీలో మానవత్వం మేలుకొందా? ఇవన్నీ ఎందుకు నా టైం వేస్టు - ఇరవై వేలుంటే ఎక్కండి. లేకపోతే లేదు" సీరియస్‌గా చెప్పాడు. తెప్ప తిప్పబోయాడు. " క్యాష్ జేబులో పెట్టుకోవడం మర్చిపోయాను. అంత లేదు, ఓ రెండు వేలుంది యిస్తాను.." సుబ్బారావు మెత్తబడ్డాడు. "మిగతాది తర్వాత యిస్తాను."

" అవన్నీ నాకెందుకు - మీ ఆవిడ మెళ్ళో గొలుసుందిగా -అదివ్వు సరిపెట్టుకుంటా" చెప్పాడు సరంగు బ్యాటరీలైటు ఆమె మెడమీదకేసి.

సులోచన ఉలిక్కిపడి చూసుకుంది- మంగళ సూత్రాలతో వేసుకున్న ఒంటిపేట గొలుసు రెండు తులాలుండచ్చు పెళ్ళినాడు చేయించింది.

" అన్నా! ఇది మంగళసూత్రం గొలుసన్నా" ఏడ్పుతో చెప్పింది.

" నిజం చెల్లమ్మా! మీ ఆయన బ్రతికుంటే గదా, దాని అవసరం ఆ తర్వాత ! ముందు రక్షించుకోండి" అంటూ నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు వాడు. ఇంకోచోటికి వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు వాడు.

సుబ్బారావుకు కోపం వచ్చింది. కాని సులోచనకు తట్టింది. ముందు ప్రాణాలతో బైటపడాలి. మళ్ళీ ఆల్మట్టి నుండి నీరు వదిలితే ఈ మిద్దెకూడా మునిగిపోతే చావడం ఖాయం. అప్పుడు వంటిమీద ఎంత బంగారమున్నా దానికి విలువలేదు, ఉండదు. వెంటనే మెడలోంచి ఆ గొలుసు, మంగళసూత్రాలు తీసి వాడికి అందించింది. కళ్ళ కద్దుకుంటూ.

వాడు ఆమె చెయ్యిపట్టుకుని జాగ్రత్తగా ఆ తెప్పలోకి లాగాడు. ఆమె బరువుకు ఆ తెప్ప అటు యిటూ అల్లాడింది. బోర్లాపడుతుందేమోనని భయం వేసింది. అతను ఆమెను ఆ మూలకు జరగమని చెప్పి బ్యాలెన్సుతో సుబ్బారావును లోపలికి ఎక్కించాడు.

ఆ తర్వాత అతను ఇంకొన్ని మిద్దెల దగ్గరికి పోయి యిలానే ఆపన్నులను ఎక్కించుకున్నాడు. తెప్ప నీళ్ళల్లో బాగా మునుగుతున్నది. ఒక వైపు ఎక్కువ బరువై నీళ్ళల్లో మునగబోతున్నది. తెప్పలో జనం కిటకిట లాడుతున్నారు. అందరికీ నయంగానే వుంది. వాడు సురక్షితంగా తమను గట్టుకు చేర్చగలడా లేదా అని...

" చూడండి ఆ వైపు బరువు ఎక్కువైంది. ఎవరన్నా దిగి ఈత కొట్టుకుంటూ రండి..."

ఎవరూ మెదల్లేదు - కదల్లేదు. చిమ్మచీకటి, జలరాక్షసి!

" అలాగైతే మీరంతా మునిగిపోతారు. నాకైతే ఈత వచ్చుకాబట్టి నేను బ్రతకగలను" కర్కశంగా అన్నాడు సరంగు.

అందరిలోనూ ఆతృత ! ప్రాణభీతి! మెదళ్ళు మొద్దుబారుతున్నాయి. దేవుడా రక్షించమని ప్రార్థిస్తున్నారు.

ఇంతలో 'అమ్మా!' అంటూ కేక - దబ్బున ఒక పాప నీళ్ళలో పడి కొట్టుకు పోయింది. శబ్దం బట్టి బ్యాటరీలైటు వేశాడు సరంగు ఆ వైపు.

వెంటనే ఒక తల్లి వెక్కి వెక్కి ఏడ్చింది. "పాపిష్టి దాన్ని నేనన్నా నీళ్ళలోకి దూకకుండా –దాన్ని పడతోశాను." ఏడ్పు.

గుండెలు పిండే విషాదం! తల్లి అనుబంధం– తల్లితనం తెగింది.

అందరి ఒళ్ళు గగుర్పొడిచింది.

తెప్ప నెమ్మదిగా బ్యాలెన్సుడుగా ముందుకు కదిలింది నిశీధిలో. ఓ పది నిముషాలలో కొండారెడ్డి బురుజు దాటి హెడ్డు పోస్టాఫీసు వైపు తెప్ప వచ్చింది. అక్కడ మోకాలు లోతు నీళ్ళు.

గబ గబ అందరూ దిగారు.

ఉన్న ఆటోవాళ్ళని చుట్టుముట్టారు.

' బస్టాండు'... 'రైల్వేస్టేషన్'... 'గుత్తిరోడ్డు'.. ఇలా ఎవరికి వారు మాట్లాడు కుంటున్నారు గందరగోళంగా.

"గుత్తిరోడ్డు..." సుబ్బారావు ఒక ఆటోవాలాని బ్రతిమాలాడాడు.

" రెండొందలు!" నిర్లక్ష్యంగా అతను జవాబిచ్చాడు.

సుబ్బారావు దిమ్మరపోయాడు– మామూలుగా యిరవై రూపాయలకు వచ్చేవాడు

ఏకంగా రెండొందలు అడుగుతున్నాడు.

సులోచన అతను ఆలోచించుకోవడానికి అవకాశం యివ్వకుండా ఆటో ఎక్కేసింది.

అలా అతని ఆటోలో చాలామంది ఎక్కారు. రాజ్‌విహార్ బ్రిడ్జి మునిగిపోయిందిట!

ఆటో నెమ్మదిగా కదిలింది. చిల్డ్రన్ పార్కు దాటి - రైల్వే స్టేషన్ రోడ్డుమీదుగా వెంకటరమణ కాలనీ మీదుగా... హైవే మీదుగా క్రిష్ణానగరు దాటి గుత్తిరోడ్డుమీదకు తెచ్చి ఆపేశాడు. అంటే చుట్టూ తిరగి వచ్చాడు.

అక్కడ బస్సులు కాని - లారీలు కాని లేవు.

సుబ్బారావు వెల్దుర్తికి పోదామనుకున్నాడు. అక్కడ బంధువులున్నారు. ఓ ముప్ఫై కిలోమీటర్ల దూరం అంతే!

కాని ఇంకో ఆటోను అడిగితే అతను ఏడువందల రూపాయలు చెప్పాడు బీడీ దమ్ముకొడుతూ.

సుబ్బారావుకు కడుపు మండిపోతున్నది మామూలుగా యిద్దరికి యాభై కూడా కాదు బస్సులో. కాని బ్రతికుంటే బలుసాకు తినొచ్చని సులోచన అతన్ని చెయ్యిపట్టుకుని గుంజింది.

ఎందుకంటే అప్పటికే ప్రవాహంలా వస్తున్న జనం దొరికిన బళ్ళల్లో డోన్‌వైపు పరుగులు తీస్తున్నారు.

అటు హైద్రాబాద్ వైపు పోవడానికి లేదు. కొత్తగా కట్టిన బ్రిడ్జీ కూలిపోయిందట! అటు-ఇటు- వాహనాలు ఆగిపోయాయని వార్త.

ఇటు నంద్యాల వైపు పోవడానికి లేదు. కుందూనది ప్రవహిస్తున్నది. నంద్యాల మునిగిపోతున్నది. అంతకంటే ముందు నన్నూరు - ఓర్వకల్లు మధ్యలో కూడా వాగులు పొంగుతున్నాయట. ఆత్మకూరు వైపు కూడా బస్సులు ఆగిపోయాయట!

ఇంక బళ్ళారి వైపు పోదామంటే కోడుమూరు దగ్గర కూడా రోడ్డు మునిగి పోయిందట. మంత్రాలయం మునిగిపోయింది.

ఉన్న ఒకే ఒక దిక్కు డోన్‌వైపు. అందుకే జనం అటు పారిపోతున్నారు. కర్నూలు పట్టణం మూడు వైపులా జలదిగ్బంధనం అయిపోయింది.

అందుకే ఆటోలో కూర్చుని బయలుదేరింతర్వాత గుండెల నిండా ఊపిరి పీల్చుకుంది సులోచన. ఆమెకు క్రైసిస్ మేనేజ్‌మెంట్ బాగా తెలుసు. దేనికీ పెద్దగా భయపడదు.

వారితోపాటు చాలామంది ఎక్కారు ఆ డీజిల్ ఆటోలో.

" ఒక శతాబ్ద కాలంగా యిటువంటి వరద రాలేదుట!"

" ప్రభుత్వం వెంటనే స్పందించలేదు. హెలికాప్టర్లు తీసుకు రాలేదు. పడవలు తీసుకురాలేదు. అంతా బెస్తవాళ్ళు - ప్రైవేటు వాళ్ళు తెచ్చిన అరిగెలు- వాళ్ళు యిష్టం వచ్చినట్టు దోచుకుంటున్నారు".

" మా ఫ్రెండ్సు యాభైవేలు యిచ్చి బయట పడ్డారు!" ఒకామె చెప్పింది.

" వన్‌టౌన్‌లో ఘోరం - చాలా మంది చనిపోయి వుంటారు. ఎక్కడ చూసినా పశువుల కళేబరాలు-" ఇంకోతను చెప్పాడు.

" అదేం వరద- చూస్తుండగానే నడుంలోతు నుండి పన్నెండు అడుగులకు పెరిగిపోయింది. వరదలో అన్నీ కొట్టుకుపోతున్నాయి. బట్టలు -బీరువాలు - టీవీలు- అబ్బ-నాశనం!" ఓ ముసలాయన బాధగా అన్నాడు.

" బ్రహ్మరాక్షసి నీళ్ళు సుళ్ళు తిరుగుతూ వచ్చి పడ్డాయి. వాటి దెబ్బకు షట్టర్లు కూడా నిలువలేదు. షట్టర్లు తెరుచుకుపోయి లోపలి సామాన్లన్నీ వరద పాలైనాయి" ఓ కుర్రాడు ఆశ్చర్యంతో చెప్పాడు.

" వరదనీటిలో కార్లు మునిగిపోయాయి. నాకంటి ముందే మిద్దెలు మునిగి పోయాయి. బ్రహ్మంగారు చెప్పిన కలియుగాంతం ఇదేనేమో!" ఓస్టూడెంట్ వ్యాఖ్యానించాడు.

దారిలో ఒక వాగు రోడ్డుకు అడ్డంగా ఉధృతంగా ప్రవహిస్తున్నది.

దేవుడిమీద భారం మోపి అతి చాకచక్యంగా ఆటోని పోనిచ్చాడు డ్రైవరు. దేవుడి దయవలన బ్రతికి బయటపడ్డారు.

మొత్తానికి అష్టకష్టాలుపడి తెల్లతెల్లవారుతుండగా తమ్ముడి వరుస అయిన సుగుణారావు ఇల్లు చేరుకున్నారు. అతను - అతని భార్య అరుణమ్మ వీళ్ళిద్దర్ని చూసి ముందు నిర్ఘాంతపోయారు.

" అదేంటి చెప్పా పెట్టకుండా యిలా ఊడిపడ్డారు?" నిద్ర చెడినందుకు బాధపడ్తూ ఆవలిస్తూ పలకరించాడు రావు.

" టీవీ చూడ్డం లేదా?" సుబ్బారావు అడిగాడు నొచ్చుకుంటూ.

" మీకు తెలియదా బావగారూ- మా వారికి టీవీ చూడ్డం మహా చిరాకు- నేను చూస్తున్నా ఆపేస్తారు. రాత్రి పదికల్లా పండుకుని తెల్లవారింతర్వాత కాని లేవరు. ఏదో మీ పుణ్యమాని లేచారు" అరుణమ్మ అంటించింది చురక.

" అది కాదమ్మా అరుణా ! కర్నూలు వరదల్లో మునిగిపోయింది. అందరూ దూర ప్రదేశాలకు పారిపోతున్నారు. మీరు గుర్తుకొచ్చి మేము యిల వచ్చాము. వరద తగ్గంగానే వెళ్ళిపోతాము" చెప్పింది సులోచన ముందుగానే.

" అయ్యో ! మిమ్మల్ని వెళ్ళమని ఎవరు చెప్పారు. ఇక్కడ వుండండి. మొహాలు

కడుక్కుంటే కాఫీ యిస్తాను" మూతి వంకర్లు తిప్పుతూ చెప్పింది అరుణమ్మ.

" అయ్యో ! మీ అన్నయ్యగార్కి ఆకలేస్తున్నది. తిండి తిప్పలు లేవు ఎప్పటినుండో - అరుణా ముందు అన్నం పెట్టు" సులోచన సిగ్గువిడిచి అడిగింది.

" ఛ ! ఇంత పొద్దున్నే అన్నం ఏం తింటారు కాని - ఉప్మా చేస్తా! తిందురుగాని" అరుణమ్మ చెప్పింది చికాగ్గా.

" సరే! - ఏదో ఒకటి - చద్ది అన్నం ఉన్నా ఫర్వాలేదు" సుబ్బారావు చెప్పాడు నీరసంగా కుర్చీలో కూర్చుండూ - ఆకలికి తట్టుకోలేక. అతడు పేషంటు.

అలా వెళ్ళిన వాళ్ళు ఓ రెండు రోజులపైనే వుండిపోవలసి వచ్చింది. కాగా రావు, అరుణల సణుగుడు మొదలైంది.

" కర్నూలులో వరద తగ్గిందట కదా! అందరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళుతున్నారట! తాళాలు వేసిన ఇళ్ళను దొంగలు దోచుకుంటున్నారట!

" డోన్‌లో కూడా ఆపన్నులను ఆదుకుంటున్నారట!"

" అనంతపురం, చిత్తూరు, కడపలనుండి లారీలకు లారీలు ఆహారం సప్లై చేస్తున్నారట!"

ప్రభుత్వం కూడా వరద బాధితులను ఆదుకుంటున్నదట!"

టీవీలో వార్తలు చూస్తున్న సుబ్బారావు కడుపు మండిపోతున్నది. నలభై ఎనిమిది గంటలు పైగా మిద్దెలమీద నిలబడి తిండి తీర్థాలు లేక చాలామంది ప్రజలు కొన్ని ప్రాంతాలలో అలమటిస్తున్నారు.

పశువులు - పక్షులు చచ్చిపోయి, శవాలు వీధుల్లో కంపుకొడుతూ భీతి కొలుపుతున్నాయి. వాటిని తీసేవాళ్ళు లేరు.

మంత్రాలయంలో ఎంతమంది యాత్రికులు గల్లంతయ్యారో తెలియదు! శ్రీవారి ఆవులు- పశుసంపద మొత్తం సర్వనాశనం! అంగళ్ళు గంగమ్మ పాలు!

ఒక్క రాత్రిలో ఎంతోమంది కోటీశ్వరులు బిచ్చగాళ్ళయిపోయారు. ఆహారం కోసం క్యూలో నిలబడి ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం సహాయక చర్యలలో విఫలమైందని టీవీలు ఘోషిస్తున్నాయి. వరద బాధితుల శిబిరాలలో కూడా వసతులు లేవు - ఆహారం సరిగా అందడం లేదు. తాగేనీరు లేదు. యాంకర్ల యింటర్వ్యూలలో ఎంతో మంది ఏడుస్తూ తమ కష్టాలు చెప్పుకుంటున్నారు.

ప్రభుత్వం కంటే ముందుగా స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి వాళ్ళ ఊళ్ళల్లో చపాతీలు - పులిహోర అన్నం తయారు చేసి కొన్ని వందల కిలోమీటర్లు ప్రయాణించి లారీలలో తెచ్చి - వరద బాధితులకు అందజేస్తున్నారు. అలాగే దుప్పట్లు- చీరలు-

తువ్వాళ్లు పంచుతున్నారు.

యావత్ భారతదేశం కర్నూలు వరదలకు చలించింది. నలువైపుల నుండి సహాయం చేస్తున్నారు. కాని దానిలో ఎంత శాతం నిజమైన బాధితులకు అందుతున్నదో తెలియడం లేదు.

సుబ్బారావు- సులోచన ధైర్యం చేసి వెల్దుర్తి వదిలి బస్సులో కర్నూలుకు బయలుదేరి వచ్చారు నాలుగు రోజుల తర్వాత.

ఏముంది, అంతా బురద! రోడ్లన్నీ సర్రున జారుతున్నాయి. ముక్కుపుటాలను బద్దలు చేస్తున్న దుర్గంధం! ఎక్కడ చూసినా విషాదం!

అవేమి వరదలోకాని వెళ్తూ వెళ్తూ ఒక మీటరు ఎత్తున బురద నింపిపోయాయి. ప్రతి రోడ్డు మీద - ప్రతి యింటిలో బురద పేరుకుపోయింది. ఇంటి తలుపులు తీసి గొల్లుమన్నాడు సుబ్బారావు.

అన్నీ నీళ్ళల్లో నాని - బురద కొట్టుకుపోయి ఉన్నాయి. సర్వం నాశనం! కొందరి ఇళ్ళ తలుపులు ఊడిపోయి - ఇంట్లోని వస్తువులన్నీ వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి.

వరదముందు, స్థలానికి అడ్వాన్సు చెల్లిద్దామని లక్షరూపాయలు బ్యాంకు ను,డి తెచ్చి పెట్టెలో పెట్టుకున్నాడు సుబ్బారావు. ఆ పెట్టె తెరిస్తే ఏముంది- అంతా బురద- నాని నాని ఆ నోట్లు చిరిగిపోయాయి. కనీసం నెంబర్లు కూడా కనపడకుండా నీళ్ళల్లో నానిపోయి ముట్టుకుంటే పిసపిస రాలిపోయాయి నోట్లు. ఎంతో కష్టపడి కూడ బెట్టుకున్న సొమ్ము ! వరదపాలు అయింది.

సులోచన పట్టుబట్టలన్నీ నాశనం అయిపోయాయి. అవి ఎందుకూ పనికిరావు. చాలా మటుకు బట్టలను రోడ్డుమీద పారెయ్యాల్సి వచ్చింది.

ప్రభుత్వం స్వంత ఇల్లు కలవారికి ఏడు వేలు యిచ్చింది. ఇంకెవరో గిన్నెలు- చీరలు - బియ్యం ఇచ్చారు. కాని వంట చేసుకునే పరిస్థితి లేదు.

సుబ్బారావుకు, సులోచనకు ఇల్లు శుభ్రం చేసుకోవడం పెద్ద సమస్య అయింది. వీధి వీధంతా గలీజు. ముక్కులు పగిలే దుర్వాసన! జర్రున జారిపడే బురద! నిర్లక్ష్యానికి గురైన పశువుల కళేబరాలు!

తడికి - తెమకు ప్రాణం పోయినట్లవుతున్నది. ఒంట్లో నలత, పడిశం, జ్వరం పట్టుకున్నాయి. కరెంటు లేదు. డ్రైనేజీ లేదు. వాటర్ సప్లై లేదు.

డాక్టర్ల డిస్పెన్సరీలు కూడా మునిగిపోవడంతో ప్రైవేటు వైద్యుల కొరత ఏర్పడింది. మందుల షాపులు మునిగిపోయి మందుల కొరత. వాళ్ళకు లక్షలకు లక్షలు నష్టం. ఎలక్ట్రానిక్ షాపులు, బట్టల షాపులు, కిరాణా షాపులు ఎన్నో ఎన్నెన్నో మునిగిపోయి

చూపరుల గుండెలు పగిలేలా చేస్తున్నాయి.

అదంతా చూస్తుంటే కర్నూలు పట్టణం ప్రగతి యిరవయ్యేళ్ళు వెనక్కి మళ్ళినట్లు అనిపిస్తున్నది.

మున్సిపల్ సిబ్బంది పారిశుధ్యం పనులకు సరిపోక పోతే కొన్ని యితర జిల్లాల నుండి సిబ్బందిని యిబ్బడి ముబ్బడిగా రప్పించారు. కాని మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లు పారిశుభ్రత చేసుకోవాలన్నా లెక్క వదలాల్సిందే! బీదవాళ్ళయినా సరే నోట్లు విదిలించాల్సిందే!

కనీసం ఐదు వందలు కూలి యివ్వందే పనివాడు పనికి రావడం లేదు. అలాంటి వారిని ఇంటి వైశాల్యాన్ని బట్టి నలుగురు నుండి పదిమంది దాకా పెట్టుకోవలసి వస్తున్నది. నలుగురు నుండి పది మంది దాకా పెట్టుకోవలసి వస్తున్నది. దానికే వేలకు వేలు ఖర్చయిపోతున్నాయి వరద బాధితులకు.

సుబ్బారావుకు కూడా పదిహేనువేలు కేవలం బురదను కడిగించుకోవడానికి ఖర్చయింది. ఆ తర్వాత ఇంటికి క్రిమిసంహారక మందులు కొట్టి సున్నాలు- వగైరాలు కొట్టించుకోవడానికి ఇంకో పదివేలు ఖర్చయింది.

వరద తగ్గిన తరువాత గృహ ప్రవేశం తిరిగి చేయడానికి ఒక నెల పట్టింది. ఈ మధ్యకాలంలో బి.క్యాంపులోని స్నేహితుడు వెంకటస్వామి ఆదుకున్నాడు. భార్యాభర్తలు రాత్రి వారింట్లో నిద్రించడం- ఉదయం లేచి వంట చేసుకుని తమ యింటికి రావడం, లేబరును కుదుర్చుకుని వారితో పాటు తాము కూడా పనులలో పాల్గొనడం చేశారు. చీకటి పడంగానే బి.క్యాంపులోని స్నేహితుడింటికి చేరడం!.

ఈ పని ఒత్తిళ్లల్లో - మానసిక - శారీరక శ్రమలో బాగా మెత్తబడ్డారు. ఇంట్లో చేరినా ఇల్లు చల్లగా ఉండి- దగ్గు పడిశం పట్టుకున్నాయి, వళ్ళు నొప్పులు.

అదృష్టం కొద్దీ పిల్లలు- ఒకడు హైద్రాబాదులో, ఇంకొకడు విజయవాడలో చదువు కొనసాగిస్తుండడం మూలాన - నష్టపోలేదు.

కారు చీకటిలో కాంతిరేఖలాగా ప్రభుత్వం వరద బాధితులకు వరాల వాగ్దానాలు చేస్తున్నదా. ఇళ్ళు మునిగిపోయిన వాళ్లకు జగన్నాథ గట్టు దగ్గర కొత్త యిళ్లు కట్టిస్తామని చెబుతున్నది. పాతికభాగం మీరు భరిస్తే - ముక్కాలు భాగం మేము భరిస్తామని చెప్పారు, ఆ అధికారులు.

దీని గురించి వివరాలు తెల్సుకుందామని మురళి యింటికి వచ్చాడు. ఎప్పుడూ కళకళలాడుతూ వుండే యిల్లు వెలవెల బోతున్నది.

సున్నాలు వేయించినా తడికి మరకలు మరకలు పడి అదోరకంగా వుంది

ముందుభాగం. వరదకు కుంగిపోయి -అక్కడక్కడ పెచ్చులూడిన గోడలు-ఎంత రిపేరు చేసినా కొంత వికారంగా కనిపిస్తున్నాయి. ఇల్లు ఏదో వాసన కొడుతున్నది.

" ఎలా వున్నావు, మురళి బాగున్నావా?" అడగకూడని ప్రశ్న అడిగాడు.

మురళి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఇంకేటి బాగు సుబ్బా ! అంతా అయిపోయింది. సర్వం నాశనం అయిపోయింది. ఆ వరదలో మేమూ కొట్టుకుపోతే బాగుండేది" మురళి బాధపడ్డాడు.

" అయ్యో ! అంతమాటనకు-దేవుడు చల్లగా చూడబట్టి బ్రతికి బయటపడ్డాం- కొన్ని గ్రామాల్లో కొంతమంది జాడ యింకా తెలియలేదు. తెల్సా?"

" హూ! బ్రతికి వుండి బావుకునేదేముంది అన్నయ్య గారూ? మా వ్యాపారం దెబ్బతింది. గోడౌన్లలోని స్టాకు అంతా దెబ్బతిని యిరవై లక్షలు నష్టం వచ్చింది. అమ్మాయి పెళ్ళికని కొన్న బియ్యం బస్తాలు- సంబరాలు బట్టలు వరద పాలయ్యాయి." ఏడుస్తూ చెప్పింది మల్లమ్మ.

" ముందు జాగ్రత్త పడలేదా?" అడిగాడు సుబ్బారావు అనవసరంగా.

" హూ! జాగ్రత్త ఎలా పడగలం ! మనింటి దాకా వరద రాదులే అనుకున్నాం. గత వంద సంవత్సరాలుగా ఈ వీధివైపు ఏ వరదా రాలేదు కదా! ప్రభుత్వం ఊరికే దండోరా ఏస్తుందిలే అనుకుని నిర్లక్ష్యం చేశాం. కాని మేము చూస్తుండగానే అకస్మాత్తుగా వరదనీరు ప్రవేశించి కొన్ని నిమిషాల్లోనే నడుందాకా వచ్చాయి. ఇంకేముంది ఎక్కడి వాళ్ళం అక్కడ యిళ్ళకు తాళాలేసి పరుగులు తీశాం. స్వంత కారున్నా మునిగిపోయింది. అతికష్టంమీద సుమో అద్దెకు తీసుకుని నంద్యాలవైపు పారిపోయాం బంధువుల ఇంటికి. దార్లో వాగులు అడ్డంవచ్చి, మళ్ళీ వెనక్కి వచ్చి, బేతంచర్ల మీదుగా చుట్టూ తిరిగి ఎలాగయితేనేం వెళ్ళాం. బ్రతికాం" మల్లమ్మ చెప్పింది.

"రెండు రోజుల తర్వాత వచ్చి చూద్దుం గదా- తలుపులు ఊడిపోయి వున్నాయి. ఇంట్లో వున్నవన్నీ ఊడ్చుకుపోయాయి. వరదలో కొన్ని పోతే వున్నవి కాస్త దొంగలు పడి దోచుకెళ్ళారు. ఇంకో పది రోజుల్లో అమ్మాయి పెళ్ళి ఉంది. ఎలా చెయ్యాలో అర్థం కావడం లేదు" మురళీ కూడా ఏడ్చాడు.

సుబ్బారావు బిత్తరపోయాడు. తనకే చాలా నష్టం వాటిల్లిందని భావిస్తూ వచ్చాడు. ఇప్పుడు తన ఆప్తుడైన మురళికి తనకంటే ఎన్నో రెట్ల నష్టం కలిగిందని మనసు ద్రవించింది.

" మురళి బాధపడకు! ప్రభుత్వ సహాయం తప్పకుండా అందుతుంది. కొత్త ఇల్లు కూడా కట్టించి యిస్తారుట!" ఓదార్పుగా అన్నాడు.

" మరి అమ్మాయి పెళ్ళి ఎప్పటికి వాయిదా వేశావు?" సుబ్బారావు గిల్టీగా

ఫీలవుతూ అడిగాడు.

" అదికాదు అన్నయ్యగారూ ! ఒక్కసారి పెళ్ళి ఆగిందంటే మళ్ళీ జరగడం చాలా కష్టం ! ఈ ముహూర్తానికే అయిపోవాలి! లేకపోతే అది డిప్రెషన్‌లోకి వెళ్ళిపోతుంది" అంది మల్లమ్మ.

" కాని... కాని.. ఎలా అన్నదే ప్రశ్న. చేతిలో డబ్బులు అడ్డం లేదు. వ్యాపారం నష్టపోయాం. అది మొదలెట్టాలంటే పెట్టుబడి కావాలి! ఎంత సింపుల్‌గా చేసినా అమ్మాయి పెళ్ళికి ఐదు లక్షలు అన్నా ఖర్చు తగులుతుంది. ఎంతో కష్టపడితే ఓ మూడు లక్షలు సేకరించు కోవచ్చు. రెండు తక్కువ పడుతున్నది" బాధగా చెప్పాడు మురళి.

" అదేంటి లక్షల్లో వ్యాపారం చేసేవాడివి - ఎన్ని లక్షలు కావాలన్నా క్షణాల్లో పుట్టించేవాడివి నీకు డబ్బు సమస్యా?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

" ఆ ! అది ఒకప్పటి మాట! నా మిత్రులందరూ దెబ్బతిన్నారు. నా సర్కిలు అంతా పాపరులై పోయారు. ఐ.సీ. ఒకటే తక్కువ. చాలా మంది ఆత్మహత్యలకు కూడా ప్రయత్నించారు. అందుకే డబ్బు దొరకడం లేదు. నీలాంటి వాళ్ళే నన్ను ఆదుకోవాలి!" మురళి బాణం వదిలాడు.

సుబ్బారావు గిలగిల కొట్టుకుని - నాలుగు మాటలు అన్యమనస్కంగా మాట్లాడి- సెలవు పుచ్చుకుని వచ్చాడు ఇంటికి.

" సులోచనా ! దేవుడు ఖచ్చితంగా లేడని తేలిపోయింది" అంటూ మురళీ వాళ్ళ కన్నీటిగాథను వినిపించాడు. మురళి అన్న చివరి మాటను కూడా వినిపించాడు.

సులోచన చిన్నగా నవ్వింది. "ఉన్నాడండి- వాళ్ళపాలిట దేవుడున్నాడు."

" నీకేమన్నా పిచ్చా? అన్ని లక్షలు పోగొట్టుకున్నారు- పిల్ల పెళ్ళి ఆగేట్లుంది."

" ఆగదు- అందుకే వాళ్ళు బ్రతికి బట్ట కట్టారు. ఆ పెళ్ళి దేవుడే జరిపిస్తాడు. చూస్తూ వుండండి!" సులోచన గంభీరంగా చెప్పింది.

" ఎలా? ఈ కాలంలో ఎవరు అంత ఉదారంగా పెళ్ళి చేసుకుంటారు. దేవుడు దిగివచ్చి ఆ పని చేయాల్సిందే!" సుబ్బారావు అడిగాడు.

" వాళ్ళ పాలిట దేవుడు మీరే!" సులోచన చెప్పింది.

" నువ్వు మెంటల్ అయిపోయావు!" ఆశ్చర్యంగా - విసుగ్గా అన్నాడు సుబ్బారావు.

" కాదు - ఆ డబ్బు మీరు ఏర్పాటు చేస్తున్నారు." దృఢంగా చెప్పింది.

" నా దగ్గర లేదు. నా ఉద్యోగం నీకు తెల్సుగా- అన్నీ అప్పులు."

" లాకరులో వున్న నా నగల మీద బ్యాంకులో అప్పు తీసుకుని వాళ్ళకి సర్దుబాటు చేద్దాం!" దృఢ నిశ్చయంతో చెప్పింది సులోచన.

" సులోచనా ! నీకేమన్నా ఆలోచన వుందా! ఒకటి కాదు - వందకాదు - రెండు లక్షలు యిస్తావా? మన చుట్టాలు కాదు- పక్కాలు కాదు- అసలు వాళ్ళు తీర్చగలరన్న నమ్మకం నీకుందా?" కోపంగా అడిగాడు సుబ్బారావు.

శాంతంగా చెప్పింది సులోచన. " నేను గాని- మీరు గాని మొన్నటి వరదల్లో పోయి వుంటే ఆ డబ్బు ఏమయ్యేది? మనమే శాశ్వతం కానప్పుడు డబ్బు శాశ్వతం కాదు. వాళ్ళు మన చుట్టాలు కారు - కాని మనకు ఆప్తులు! మనం ఆదుకోవాలి! అంతే! ఎక్కడో ప్రపంచం నలుమూలలలో వుండి కర్నూలు ప్రజల కోసం లక్షలు - కోట్లు వెచ్చిస్తున్న వాళ్ళను చూసి మనం నేర్చుకోవాలి! మనకు చేతనైన సహాయం యితరులకు మనం ఈ పొద్దు చేస్తే రేపు ఆ దేవుడు మనకు సహాయం చేస్తాడు అవసరమైనప్పుడు. అలా అనుకోక పోయినా - కనీసం మనవాళ్ళు అనుకున్న వాళ్ళను మనం ఆదుకోవడం మానవత్వం అనిపించుకుంటుంది."

సుబ్బారావుకు ముందు భయం కలిగినా- ఆ తర్వాత ఆమె మాటల్లో నిజం వుందనిపించింది. అందుకే 'నేను సైతం' అంటూ ముందుకు పోదలచుకున్నాడు. ఇప్పుడు తన బ్రతుక్కి కొంత సార్థకత కలుగుతుంది!.

- నది ఏప్రిల్ 2011